క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రా స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం, సత్యానారాయణ స్వామి వ్రతంలో గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ

కందనూలు: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న జ్ఞానేశ్వర వాత్సల్య మందిరంలో అనాథ పిల్లలకు దుస్తులను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేగుంట గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి తన కూతురు ప్రియాంక జ్ఞాపకార్థం దుస్తులు సమకూర్చారు. కార్యక్రమంలో కొండ నాగేష్ , గోసుల బాలయ్య, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్‌కు అంబేడ్కర్ ప్రతిభ అవార్డు

లింగాల: విద్యారంగంలో చేసిన కృషికి మండలంలోని అవుసలికుంటకు చెందిన గద్ద శ్రావణ్‌కుమార్‌కు అంబేద్కర్ ప్రతిభ అవార్డు దక్కింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సాహితీ కళా సేవా ప్రతిభ అంబేద్కర్ అవార్డును అందుకున్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ ఇందిరా, సినీ నటుడు గౌతంరాజు, నిర్మాత పరుచూరి శ్రీనివాసులు అవార్డు, మెమోంటోతో సత్కరించారు.

బాధితకుటుంబానికి ఆర్థిక సాయం

తాడూరు: మండలంలోని చర్ల ఇటిక్యాల గ్రామానికి చెందిన ప్రమిళమ్మ(58) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సమకూర్చిన రూ.10వేల ఆర్థికసాయాన్ని గురువారం నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. రామకృష్ణ, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యం గౌడ్, జైపాల్ రెడ్డి తదితరులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఏఎస్సై మృతి

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ గ్రామం ఉమామహేశ్వర కాలనీకి చెందిన ఏఎస్సై నాన్యనాయక్ (60) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని మహంకాళి పోలీస్ స్టేషన్‌లో నాన్యనాయక్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. 10 రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య కమలబాయితో పాటూ ఒక కుమారుడు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. గత నెలలో అతని సోదరుడు మాజీ సర్పంచ్ హీర్యానాయక్ గుండెపోటుతో మృతి చెందాడు. రెండు నెలల వ్యవధిలో ఇద్దరు అన్నతమ్ముళ్లు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కోళ్ల దొంగపై కేసు నమోదు

బల్మూర్: మండల కేంద్రంలో ఓ రైతు పొలంలో నాటుకోళ్లను దొంగిలించిన ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు మొల్గర తిరుపతయ్య తన వ్యవసాయ పొలం వద్ద నాటుకోళ్లను పెంచుతున్నాడు. పొలం వద్ద ఎవరు లేని సమయంలో గ్రామానికి చెందిన వర్ధం లింగం బుధవారం రాత్రి కోళ్లను ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు శివారులో కొనసాగుతున్న మైనింగ్ పనులకు అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన నక్కెరకంటి వెంకటయ్య, అతని భార్య భాగ్యమ్మ, సైదాబాబు, కాశమ్మలు ఆటంకం కల్గిస్తున్నారని వీరకారి రామ్‌కిరణ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒప్పందం కుదుర్చుకున్న దాని కన్న అధికంగా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారని బాధితుడు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వికాసత్ భారత్ సంకల్ప యాత్ర కోఆర్డినేటర్ శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని నందిమళ్లలో గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికాసత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీలపై యంత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, వైద్యాధికారి రూపశ్రీ, భరత్, పలువురు పాల్గొన్నారు.


మన్ననూరులో..


కొల్లాపూర్ రూరల్ మండలం ఎల్లూరులో


అచ్చంపేట మున్సిపాలిటీ మొదటి వార్డులో


ఉప్పునుంతలలో ..

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ


వెల్దండలో


కొల్లాపూర్ 10వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్ రహీంపాష

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

■ ఊర్కొండ మండలంలోని మాదారంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ప్రజలను దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందచేశారు. అదే విధంగా రాచాలపల్లిలో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లు ధ్యాప నిఖిల్ రెడ్డి, సర్పంచ్ విజయమ్మ, అనిల్ రెడ్డి, సర్పంచ్ పర్వత్ రెడ్డి కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ కోడేరు మండల కేంద్రంలో 332 దరఖాస్తులు, ఎత్తంలో 506 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ బాలచంద్రసృజన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరులో ఎంపీపీ బోజ్యానాయక్ ప్రజాపాలనను ప్రారంభించారు. మొత్తం 130 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ చెన్నమ్మ పేర్కొన్నారు. రైతుభరోసా, రేషన్‌కార్డుల కోసం అధికంగా దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. సర్పంచ్ బండి లక్ష్మీదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

■ చారకొండ మండల కేంద్రంతో పాటు జూపల్లి, సిర్సనగండ్ల గ్రామాల్లో ఎంపీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. జూపల్లి 421, చారకొండ 325, సిర్సనగండ్ల 138 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

■ అచ్చంపేట మున్సిపాలిటీలోని 20 వార్డులతో పాటు మండలంలోని నడింపల్లి, పులిజాల, బొమ్మనపల్లిలో అభయహస్తం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

■ బల్మూర్ మండల కేంద్రంతోపాటు కొండనాగుల గ్రామాల్లో అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 1316 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో దేవన్న, తహసీల్దార్ సలీమోద్దీన్, ఎంపీపీ అరుణ, ఎంపీఓ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

■ లింగాల మండలంలోని అంబట్‌పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలనను డీపీఓ పరిశీలించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా కౌంటర్లను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. అంబట్‌పల్లిలో 310 దరకాస్తులను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగమ్మ, వైస్ ఎంపీపీ నారాయణగౌడు, సర్పంచు రవిశంకర్, ఏఓ నాగార్జునరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

■ తాడూరు మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్‌లో ప్రజాపాలనలో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటదాసు సందర్శించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరాంకు సూచనలు సలహాలు ఇచ్చారు.

■ తెలకపల్లి మండల కేంద్రంతోపాటు పెద్దపల్లిలో ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ ప్రశాంతంగా కొనసాగింది. తెలకపల్లిలో గ్రామపంచాయితీ వద్ద 10 కౌంటర్లు, పెద్దపల్లి రైతువేదికలో 9 కౌంటర్లలో ఏర్పాటు చేశారు. తెలకపల్లిలో 487 దరఖాస్తులు ఎంపీడీఓ భాస్కర్, పెద్దపల్లిలో 284 దరఖాస్తులు ఎంపీఓ వెంకటయ్య దరఖాస్తుల స్వీకరించారు.అదే విధంగా తెలకపల్లి ప్రజాపాలన కేంద్రాలను నాగర్‌కర్నూల్ డీఆర్‌డీఓ నర్సింగరావు, డీఎల్‌పీఓ రామ్మోహన్ రావుతో పాటు పెద్దపల్లిలో మండల ప్రత్యేకాధికారి స్వామి సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. జెడ్పీటీసీ సుమిత్ర తహసీల్దార్ మురళీ మోహన్ రావు, సర్పంచ్ సురేఖ బాలగౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, పెద్దపల్లిలో సర్పంచ్ అనసూయ సుధాకర్, వెంకటయ్యగౌడ్, ప్రకాశ్, బాలగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

■ వెల్దండ మండల కేంద్రంతో పాటు కొట్ర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 బృందాలు, కొట్రలో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో ఏడు బృందాలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వెల్దండలో 743 మంది, కొట్రలో 385మంది లబ్ధిదారులు వివిధ పథకాలకు దరఖాస్తులు చేసుకున్నారు. డీఎల్‌పీఓ పాండరినాథ్, ఏఓ మంజుల, సూపర్‌డెంట్ మోహన్ లాల్, పాల్గొన్నారు.

■ కల్వకుర్తి మండలంలోని తర్నికల్, మార్చాల గ్రామాల పరిధిలో 716 దరఖాస్తులు ప్రజల నుండి అందినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. మార్చాలలో 423 దరఖాస్తులు, తర్నికల్ 293 దరఖాస్తులు అందాయి. తహసీల్దార్ ఇబ్రహీం దరఖాస్తులను స్వీకరించారు.

■ పదర మండల కేంద్రంతో పాటు మండలంలోని జోత్యనపాయక్‌తాండాలో 551, అమ్రాబాద్, మన్ననూర్‌లో 562 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పదర ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ తబితారాణి, అమ్రాబాద్ తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

■ ఉప్పునుంతల మండల కేంద్రంలో గ్రామసభను ఎంపీపీ తిప్పర్తి అరుణ ప్రారంభించారు. అంతకుముందు స్పెషలాఫీసర్ శ్రీధర్‌జీ, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు ఆరు గ్యారంటీలైన సంక్షేమ పథకాలు, దరఖాస్తులు చేసుకునే విధానంపై వివరించారు. సర్పంచ్ కట్టా సరిత, ఉప సర్పంచ్ పుల్లమ్మ, తాడూరులో తహసీల్దార్ తబితారాణి, వెల్టూర్‌లో ఎంపీఓ నారాయణ ఆధ్వర్యంలో అధికారులు బృందాలు దరఖాస్తులను స్వీకరించారు.

■ వంగూరు 259, ఉల్లంపల్లి 60, రంగాపూర్ 505, రంగాపూర్ తండా 254 చొప్పున దరఖాస్తులు అందాయి. తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌తోపాటు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ మున్సిపాలిటీలోని 20 వార్డులో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వార్డు కౌన్సిలర్లు కేంద్రాలను ప్రారంభించారు. అన్ని వార్డుల్లో 1100 దరఖాస్తులు అందాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ మహిమూదా బేగం, కమిషనర్ రాజయ్యలు పరిశీలించారు.


లింగాల మండలం తాడూరులో

■ పెంట్లవెల్లిలోని 600 దరఖాస్తులు, జటప్రోలులోని 400 దరఖాస్తులు చేసుకున్నారు.

■ మన్ననూర్ పరిధిలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహణ కోసం కేటాయించిన సిబ్బంది పని తీరును ఎంపీడీఓ రామ్మోహన్ పరిశీలించారు. మొదటి రోజు 330 వరకు దరకాస్తులు వచ్చాయని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాంనాయక్, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎంపీఓ వెంకటయ్య, పంచాయితీ కార్యదర్శి భీముడు, ఏఈఓ సీతారాం, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

■ పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీటీసీ రోహిణి అన్నారు. తాడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. పార్టీలకతీతంగా అభివృద్దే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం జెడ్పీ సీఈఓ ఉష మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.సర్పంచ్ యాదమ్మ, ఎంపీటీసీ రేణుక, ఎంపీడీఓ గంగమోహన్, ఏఓ సాయిరమేష్‌కుమార్, తహసీల్దార్ ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

■ పెద్దకొత్తపల్లి మండలంలోని మరికల్, పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, కల్వకోలు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సభలను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, పెద్దకొత్తపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ శశికళాశివశంకర్, ఎంపీడీఓ కృష్ణయ్య, నాయకులు దండు నర్సింహా, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు


కల్వకుర్తి మండలం తాండ్రలో నినాదాలు చేస్తున్న నాయకులు


పెంట్లవెల్లిలో ఆవిర్భావ వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని కాంగ్రెస్ శ్రేణులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కల్వకుర్తి మండలం తాండ్రలో రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. కొల్లాపూర్‌లో మహాత్మాగాంధీ, నెహ్రూలా చిత్రపటాలకు టీపీసీసీ నాయకుడు రంగినేని జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెంట్లవెల్లిలో యువజన రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ గౌడ్ కేక్ కట్ చేశారు. వంగూరులో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మన్ననూర్, మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, వటువర్లపల్లి, సార్లపల్లి గ్రామాల్లో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

చారకొంట మండల కేంద్రంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, బల్మూర్‌లో మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, అచ్చంపేట ఆర్టీసీ బస్టాండు ఎదురుగా పార్టీ జెండాను నాయకులు ఎగురవేశారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి


కేక్‌కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

అచ్చంపేట రూరల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని మారుతినగర్‌లో నిర్వహించిన రక్షిత మహిళా సొసైటీ వార్షికోత్సవంలో ఆయన కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఎనిమిదేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన సొసైటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మండికారి బాలాజీ, సొసైటీ అధ్యక్షురాలు చేపూరి జయమ్మ, ప్రధాన కార్యదర్శి మాధవి, అంజలి, రాధిక, గిరిజ, స్వాతి, కళావతి, హేమలత, గీత, మంజుల, జ్యోతి, అనిత, హరిత పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాలు కిటకిట


మీసేవ కేంద్రాల వద్ద గుమిగూడిన ప్రజలు

కల్వకుర్తి టౌన్: అభయహస్తం దరఖాస్తులు అందించేందుకు వచ్చిన ప్రజలతో పట్టణంలోని మీసేవ కేంద్రాలు కిటకిటలాడాయి. గురువారం నుంచి ఆయా వార్డుల పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల నుంచి మున్సిపల్ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తుతో పాటు జతపరచాల్సిన పత్రాల జిరాక్స్‌ల కోసం జనం ఇబ్బందులు పడ్డారు. వివిధ పత్రాల ప్రింట్ కోసం మీ సేవల వద్ద ప్రజలు బారులు తీరారు. అధికారులు సైతం దరఖాస్తుకు జతపరాల్సిన పత్రాలపై ఎలాంటి సందేహాలున్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద అధికారులు ఎలాంటి సందేహాలను నివృత్తి చేయలేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఫారాలు లేక ఇబ్బందులు

గ్రామసభ కౌంటర్ల వద్ద దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. దరఖాస్తు ఫారాల కోసం జిరాక్స్ దుకాణాల వద్ద అరగంట పైగా క్యూలో నిల్చున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.10–20 వసూలు చేశారు. ఉచితంగా ప్రభుత్వమే అందించాల్సిన ఫారాలను డబ్బులను పెట్టి మరీ కొనుగోలు చేశారు. వీటికి తోడు దరఖాస్తు ఫారాలను నింపేందుకు సైతం కొందరు అక్కడే కేంద్రాల వద్ద ఉండి నింపి ఒక్కో దరఖాస్తుకు రూ.30–50 తీసుకున్నారని ప్రజలు వాపోయారు.

కనీస సమాచారం లేదు

ప్రభుత్వం సూచించిన విధంగా దరఖాస్తులను నింపేందుకు, ఇచ్చేందుకు వెళ్లిన సమయంలో కౌంటర్ల వద్ద అధికారులు కనీసం సమాచారం ఇవ్వటం లేదు. దరఖాస్తును కేంద్రాల వద్ద లేకపోవటంతో జిరాక్స్ సెంటర్ల వద్ద డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

–ఇందిరా, గృహిణి, గాంధీనగర్

ఈ-కేవైసీకి బారులు


కల్వకుర్తిలో గ్యాస్ ఏజెన్సీ వద్ద..

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని లక్ష్మీ నరసింహా గ్యాస్ ఏజెన్సీ వద్ద జనాలు ఈ–కేవైసీ కోసం వినియోగదారులు గురువారం బారులు తీరారు. ఈ–కేవైసీ కోసం మూడు నెలల వరకు గడువు ఉన్నా ఏజెన్సీ నిర్వాహకులు చెప్తున్నా ప్రజలు పట్టించుకోకుండా ఏజెన్సీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. లబ్ధిదారులు ఇంటి వద్దే ఈకేవైసీ చేసుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

తాడూరు: గ్యాస్ రాయితీ పథకం అమలు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రానికి చెందిన భారత్ గ్యాస్ డీలర్ తిరుపతయ్య గ్రామ గ్రామానికి తిరిగి ఆయా గ్రామపంచాయతీల ఆవరణలో లబ్ధిదారులకు ఈ కేవైసీ చేయిస్తూ అవగాహన కల్పించారు. ఇంటింటా తిరిగి ఈకేవైసీ చేయిస్తామని ఆయన తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడి


మారేడుదిన్నె తండాలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాన్‌దిన్నెతండాలో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 360 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 25 కేజీల నవసాగ్రం, 360 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పరమేశ్‌గౌడ్ తెలిపారు. దాడుల్లో సీఐ రామయ్య, ఎస్‌ఐ రాజ, పీసీ మంజూల, మహేష్, దస్తగిరి, చిన్నగౌడ్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

మన్ననూర్: హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన వాసుదేవరాజ్ కుటుంబ సభ్యులు గురువారం శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. మన్ననూర్ మసీద్ ఎదుట విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్నది. స్తంభం విరిగి రెండు మీటర్లు కారుతో పాటూ ముందుకు దూసుకు వెళ్లింది. విద్యుత్ తీగలు తెగిపడకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. కారులో నలుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

విద్యుత్ ఏఈపై సభ్యుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు ప్రగతి నివేధికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వివరించారు. గ్రామాలకు మంజూరైన విద్యుత్ స్తంభాలను విద్యుత్ ఏఈ ఇష్టానుసారంగా కాంట్రాక్టర్‌కు అప్పగిస్తున్నారని యాపట్ల సర్పంచ్ రమేష్ రావు, పెద్దకార్పాముల ఎంపీటీసీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. అనంతరం రూర్బర్ మిషన్ డీపీఎం మంజూల మాట్లాడుతూ రూర్బన్ మిషన్ ద్వార రూ.16 కోట్ల నిధులు మంజూరుకాగా రూ.11 కోట్ల నిధులు వినియోగించినట్లు పేర్కొన్నారు. రూ.5 కోట్లు కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. 421 పనులకు గాను 360 పనులు కొనసాగుతున్నాయి. మరో 33 పనులు ప్రారంభించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మాట్లాడుతూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. వ్యవసాయాధికారి శిరీష మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు రైతులకు 2.5 ఎకరాల భూమి ఉన్న వారికి రైతుబంధు నిధులు రైతుల రైతుల ఖాతాలో జమ అయ్యాయన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ రాజాసింగ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు పూజలు


పీఠాధిపతితో గ్రామస్తులు

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో అగస్తేశ్వరాలయం పునర్నిర్మాణ పనులకు గురువారం జగద్గురు గాయత్రీ పీఠాధిపతి శ్రీకాంతేంద్ర స్వామి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములై స్వామివారి కృపా కటాక్షం పొందాలన్నారు. 42 ఏళ్ల కిందట శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఆలయం ముంపునకు గురైతే గ్రామస్తులు ఏకాభిప్రాయంతో ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు రావడం శుభపరిణామన్నారు. సర్పంచ్ తిరుపాటి నాగరాజు, పోతుల వెంకటేశ్వర్లు, మదుగం నర్సింహ యాదవ్, నారాయణ రెడ్డి, శ్రీను, నర్సింహా, రాముడు, డిష్ రవి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికాసత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్లను గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గూర్చి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రామ్మోహన్, ప్రభాకర్, దివాకర్, రమేష్ రాథోడ్ పాల్గొన్నారు.